క్లుప్తంగా

5 నుంచి కోట సత్తెమ్మ జాతర

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మున్సిపల్ కాలనీ పెద్దరెల్లి వీధిలో శ్రీకోట సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రెల్లికుల జిల్లా సెక్రటరీ నీలాపు వెంకట్, మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్త నీలాపు విజయ నాగలక్ష్మి తెలిపారు. ఏప్రిల్ 5న అమ్మవారి జాతర మహోత్సవ కలశ స్థాపన నిర్వహిస్తున్నామని 7న అఖండ అన్న సమారాధన , 8న కాలనీలో జాతర, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, ఏప్రిల్ 9 ఆదివారం ఉదయం 10 గంటలకు అమ్మవారి మహా జాతరను నిర్వహిస్తామన్నారు. అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా ఊరేగింపును ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతమ్మ, నీలాపు సత్యనారయణ, శ్యామలరావు, దనల పరమేష్, పూర్ణచంద్ర, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యా సామగ్రి అందిస్తున్న సర్పంచ్ శివాజీ రాజు

పాలకోడేరు: విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గొరగనమూడి సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు అన్నారు. గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల ఫేర్వెల్ పార్టీని హెచ్ఎం వెంకటేశ్వర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివాజీ రాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వస్తువులు కల్పిస్తుందని విద్యార్థులు మంచి నడవడికతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షకు వెళ్లే విద్యార్థులకు గొరగనమూడి గ్రామ ఆశ వర్కర్ మన్నే అనంత సూర్యకుమారి మహంకాళి వరప్రసాద్ దంపతులు విద్య సామగ్రిని అందించారు. ఆ సామగ్రిని సర్పంచ్ శివాజీ రాజు, పొన్నమండ బాలకృష్ణ, జానకిరామరాజు, పరమేశ్వరరావు, హెచ్ఎం వెంకటేశ్వరరావు, కార్యదర్శి పోలయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రాట్నాల రామకృష్ణస్వామి

భీమవరం అర్బన్: మండలంలోని కొమరాడ గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లకు బుధవారం సర్పంచ్ రాట్నాల రామకృష్ణస్వామి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారమన్నారు. ఈ విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మందా యాకాబు, బొంతా రాజరామ్, మైనా వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి మృతి తీరని లోటు

సాక్షి, భీమవరం: మాజీ మంత్రి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు, తాడేపల్లిగూడెం మాజీ శాసన సభ్యులు యర్రా నారాయణ స్వామి మృతి పట్ల భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వివిధ పదవులు చేపట్టి జిల్లా అభివృద్ధికి నారాయణస్వామి ఎనలేని సేవలందించారని ఆయన మృతి జిల్లాకు తీరని లోటు అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి దేశానికి సేవలందించారని నారాయణ స్వామి సేలను కొనియాడారు.

కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు



కొప్పాడి కాసు బాబు

పాలకోడేరు: మానసికంగా ఇబ్బందులు పడుతున్న తన పెద్ద కుమారుడు కొప్పాడి కాసుబాబు ఈనెల 18 నుంచి కనిపించడం లేదంటూ తండ్రి ధర్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు బుధవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పల్లం గ్రామానికి చెందిన కొప్పాడి ధర్మారావు బతుకుతెరువు కోసం భార్యాబిడ్డలతో నాలుగు సంవత్సరాల క్రితం గొల్లలకోడేరు గ్రామంలోకి వచ్చారు. అప్పటినుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు కాసుబాబుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స చేస్తూ వస్తున్నారు. ఈ నెల 18న తండ్రి ధర్మారావు బైక్ బాగు చేసుకునేందుకు భీమవరం వెళ్లారు వచ్చేసరికి కాసు బాబు లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో కాసుబాబు తండ్రి పోలీసులను ఆశ్రయించాడు.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరంలో నిర్వహించిన ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత డ్వాక్రా రుణమాఫీ వేడుకలు వీరవాసరంలోని తులసి కల్యాణ మండపంలో బుధవారం వేలాది మంది మహిళల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెలకొల్పారని అన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో విశ్వసనీయతను పక్కనపెట్టి రాజకీయాలు చేశారని, దాని కారణంగా ప్రజల్లో రాజకీయ నాయకుల హామీలు అంటే నమ్మలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడున్నర సంవత్సరాలుగా చూస్తే ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ తిరిగి ప్రజల్లో రాజకీయ నాయకుల హామీలకు నమ్మకం కలిగించేలా పనిచేస్తున్నారని అన్నారు. 98 శాతానికి పైగా హామీలను అమలు చేసిన ఘనత దేశంలో మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని స్పష్టం చేశారు. కరోనా సమయంలో కూడా హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా కూడా రాజీ పడలేదని గుర్తు చేశారు. నవరత్న పథకాలు అమలు చేస్తూ ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల నిధులను అమలు చేస్తున్న నేపథ్యంలో చంద్రబాబు ఓర్వలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. పప్పు ,బెల్లాలు మాదిరిగా ప్రజలకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ప్రభుత్వం పై చంద్రబాబు తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. మరోసారి చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అయితే ప్రజలు చంద్రబాబు మోసాలను ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. డ్వాక్రా రుణమాఫీ పథకంలో భాగంగా వీరవాసరం మండలానికి మూడో విడతగా 12,564 సంఘాలకు గాను సుమారు రూ.11.08 కోట్ల మేర నిధులు మహిళల ఖాతాల్లోకి జమ అయ్యాయని అన్నారు.

పవన్ కల్యాణ్ ప్రశ్నించక పోతే ఎలా...

ఆనాడు చంద్రబాబు మోసాలను పవన్ కల్యాణ్ ప్రశ్నించలేదని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో నలుగురు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను చంద్రబాబు కొనుగోలు చేసినప్పుడు కూడా పవన్ కల్యాణ్ ప్రశ్నించక పోవడం పై ఆయన అభిమానులు బాధపడుతున్నారని అన్నారు. రాజకీయాల్లో పవన్ నిజాయితీగా ఉంటే అందరూ సంతోషిస్తారని, కానీ మరోసారి మోసాల చంద్రబాబుకు అండగా నిలబడే విధంగా పవన్ కల్యాణ్ చూస్తున్నారని ప్రజలు గమనించాలని కోరారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాం

పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మత్స్యపురిపాలెం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి నాగదుర్గ మల్లేశ్వర రావు(బాబు), మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పోలిశెట్టి దాసు, మానుకొండ ప్రదీప్, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, సర్పంచ్‌లు చికిలే మంగతాయారు, సైదు శ్రీనివాస రావు, గడ్డం భారతి, సల్లిమెల్లి వెణుక, వీరవల్లి శ్రీనివాసరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, బోనం పరమేశ్వరరావు, దాసరి మాణిక్యం, బీసెట్టి వరలక్ష్మి, మేకల వెంకట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి ఉత్సవ విగ్రహాల అందజేత



గుమ్ములూరు గ్రామంలో ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆకివీడు: పురాతన రామాలయానికి పంచ లోహ విగ్రహాల్ని దాతలు సమర్పించారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలోని పురాతన రామాలయంను ఇటీవల పునర్నిర్మించారు. ఆలయంలో శ్రీరామచంద్రమూర్తి, సీత, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి వార్ల పాలరాతి విగ్రహాల్ని ప్రతిష్టించారు. ఆలయంలో పంచలోహ విగ్రహాల్ని గరికపాటి వెంకటేశ్వరరావు దంపతుల ఆర్థిక సహాయంతో అందజేశారు. విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీరామ నవమి కార్యక్రమాన్ని మూడు రోజులు పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సంప్రోక్షణ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ గౌరవధ్యక్షులు వానపల్లి బాబూరావు, సుంకర నాగేశ్వరరావు, సర్పంచ్ కోట అనంతలక్ష్మీ, చిన్నా, చిక్కాల రామాంజనేయులు(చిన్నా), పులగం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఆకివీడు నగర పంచాయతీ బడ్జెట్ ఆమోదం



ఆకివీడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో 2023–24 సంవత్సరానికి సంబంధించి అంచనాల బడ్జెట్‌ను ఏకగ్రీవంగా కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో నగర పంచాయతీలో ప్రారంభ నిల్వ రూ. 89,75,173లు లో కలిపి, సాధారణ, మూల ధనముల నుండి మొత్తం రూ. 9,09,36,240లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఏడాదిలో వివిధ అభివృద్ధి పనులు, వాటర్ సప్లై, జీతాలు, మురికి వాడల అభివృద్ధి, షెడ్యూల్డ్ , షెడ్యూల్డ్ తెగల కులాలకు, స్త్రీ, శిశు సంక్షేమంకు, దివ్యాంగుల నిమిత్తం, వీధి దీపాలు, రోడ్లు, డ్రెయినేజీ, శానిటేషన్ తదితర వాటి వినియోగానికి అంచనా వ్యయం రూ. 8,96,75,000లు ఖర్చు చేయనున్నారు. అంత్య నిల్వ రూ. 12,61,240లుగా సూచించారు. నగర పంచాయతీలో ఆస్తి పన్ను, మార్కెట్ శిస్తు, ఎసైండ్ రెవిన్యూ, అద్దెలు, చెట్ల ఫలసాయం, చేపల చెరువులు వంటి వాటి నుంచి నిధులు, వివిధ గ్రాంట్లు, సబ్‌ప్లాన్ నిధులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్, వివిధ ప్రభుత్వ గ్రాంటుల నుంచి నిధులు వస్తాయని అంచనా వేశారు. అంచనాల బడ్జెట్‌ను నగర పంచాయతీ కమిషనర్ తిరుమలరావు ప్రవేశ పెట్టారు. కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

అభివృద్ధి పనులకు సమావేశం ఆమోదం

బడ్జెట్ సమావేశం అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో అభివృద్ధి పనులపై పలు అంశాల్ని కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. తక్కువ టెండర్ దారుడికి 20 టన్నుల ముగ్గు , 30 బస్తాల బ్లీచింగ్ కొనుగోలుకు ఆమెదం తెలిపారు. రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని గంగానమ్మకోడులో షిల్టు తొలగించుటకు 2022–23 సంవత్సరం నిధుల నుంచి రూ.10 లక్షలు, 1 నుంచి 20 వార్డుల్లోని డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపునకు రూ.10 లక్షలు, మూలలంక బోదిలో సిల్టు తొలగింపునకు రూ.7.82 లక్షలు, అందేవారి బోదె ప్రాంతంలో సిల్టు తొలగింపునకు రూ.8.75 లక్షలు, పట్టణశివారు ప్రాంతంలో మంచినీటి సరఫరాకు రూ.99,900లు, రోడ్లు రిపేర్లు, అత్యవసర పనులు చేపట్టేందుకు రూ.5 లక్షల నిధులు వెచ్చిచేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. 1 నుంచి 20 వార్డుల్లో చెత్త తొలగింపునకు నాలుగు ట్రాక్టర్ల టెండర్ కాలపరిమితి ముగియడంతో మరొక నెల పొడిగిస్తూ ట్రాక్టర్ ఒక్కొంటికి రూ.70 వేలు చొప్పున ఖర్చు చేసేందుకు చేసిన ప్రతిపాదనలను కౌన్సిల్‌లోని ప్రతిపక్ష సభ్యులు డీసెంట్ ఇచ్చారు. మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం డీసెంట్ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కమిషనర్ తిరుమలరావు విలేకరులకు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని కార్మిక నగర్ ప్రాంతంలోని మూలలంక పంట కాల్వ పూడుకుపోయిందని, వెంకయ్య వయ్యేరు నుండి పంట కాల్వ దళిత పేట వరకూ ఉన్న ప్రాంతాన్ని దుంపగడప కాలువలో కలిపివేయడంతో మిగిలిన భాగంలోకి నీరు వెళ్లక మురుగు నీరు ప్రవేశిస్తుందని, పంట కాల్వను తవ్వించాలని కౌన్సిలర్ కట్టా రవి సమావేశంలో విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్



పన్ను చెల్లించకపోవడంతో నీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మంచినీటి కుళాయి పన్నులు వసూలు చేసేందుకు మునిసిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ చర్యలు చేపట్టారు. మునిసిపల్ రెవెన్యూ అధికారి డి.సోమ శేఖర్ యాదవ్, ఏసీపీ పి.గౌరు, మునిసిపల్ ఆర్ఐ కృష్ణ మోహన్, ఇంజనీరింగ్ అధికారులు, వార్డ్ సచివాలయ సిబ్బంది ఒక టీంగా ఏర్పడి పట్టణములో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీనిలో భాగంగా భాగంగా 21 అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి పన్ను వసూళ్లకు చర్యలు తీసుకున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్‌లకు కుళాయి కనెక్షన్లు తొలగించారు. దాదాపు 30 లక్షల రూపాయలు వరకు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనిలో ఇద్దరు యజమానులు అక్కడికక్కడే బకాయిలు చెల్లించడం తో కుళాయి కనెక్షన్ల తొలగింపు నిలిపివేశారు. సంబంధిత యజమానులకు బకాయిలు వెంటనే చెల్లించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ హెచ్చరించారు. కుళాయి పన్నులు చెల్లించని వారిపై కుళాయి కనెక్షన్ లు తొలగించేందుకు శుక్రవారం నుంచి ప్రత్యేక టీంలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా సెలవు అయినప్పటికీ ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి మునిసిపల్ ఆఫీస్‌లో ప్రత్యేక కౌంటర్ లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని 39 వార్డు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పని చేస్తాయని తెలిపారు ఆస్తి పన్ను చెల్లించే యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వడ్డీ రాయితీ గడువు కూడా మార్చి 31తో ముగుస్తుందని పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న రాములోరి కొయ్య విగ్రహాలు



ఎస్.టర్నింగ్ వద్ద పూజలందుకుంటున్న శతాధిక రాములోరి కొయ్య విగ్రహాలు

ఆకివీడు: స్థానిక ఎస్.టర్నింగ్ వద్ద ఉన్న రామాలయంలో శతాధిక రాములోరి కొయ్య విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. నవమి వచ్చిందంటే ఈ విగ్రహాలకు రంగులు వేసి అలంకరిస్తారు. పూర్వం ఉత్సవ విగ్రహాల్ని తయారు చేసే స్తోమత లేక భక్తులు కర్రతో తయారు చేసి పూజించేవారు. ఆ విగ్రహాలు పూజలందుకుంటూ వందేళ్లకు పైగా సజీవంగానే ఉన్నాయి. పురుగు,పుట్ర పట్టలేదు. చెదలు దరికి చేరలేదు. రాములోరి విగ్రహాలతో పాటే కొయ్య ఉత్సవ విగ్రహాల్ని అన్నం భోగయ్య వంశీకులు పూజలు నిర్వహిస్తున్నారు. కొల్లేరు సరస్సుకు వరదలు వచ్చిన రోజుల్లో ఈ ప్రాంతం వరకూ వరద నీరు చొచ్చుకు వచ్చిందని, పడవల ద్వారా ప్రజలు ఎస్.టర్నింగ్ ప్రాంతం వరకూ వచ్చే వారని పెద్దలు చెబుతుంటారు. ఆ విధంగా వచ్చిన అగ్నికుల క్షత్రియులు ఈ ప్రాంతంలో రాములోరి ఆలయాన్ని నిర్మించారని పెద్దలు చెబుతున్నారు. ఇప్పటికీ శ్రీరామ నవమి రోజు ప్రత్యేక పూజలను అగ్నికుల క్షత్రియ దంపతులు చేయడం ఆనవాయితీగా వస్తుంది.

టీడీపీలో చల్లారని అసంతృప్తి జ్వాల

సాక్షి, భీమవరం: నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఆరడం లేదు. జిల్లాలో టీడీపీని జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి భ్రష్టు పట్టిస్తున్నారంటూ కొంతమంది తెలుగు తమ్ముళ్లు నిరసన గళం విప్పిన సంగతి తెలిసిందే. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు రాకుండా తొక్కేస్తున్నారంటూ ఆందోళన చేపట్టిన ఆపార్టీ నాయకులు ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెంనాయుడు జన్మదిన వేడుకలు సీతారామలక్ష్మితో కాకుండా వేరుగా నిర్వహించగా, ప్రస్తుతం టీడీపీ 41వ ఆవిర్భవ దినోత్సవాన్ని సైతం బుధవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో పార్టీనాయకుడు చిలుకూరి రామకృష్ణచౌదరి ఆధ్వర్యంలో వేరుగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జువ్వలపాలెంరోడ్డులో ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

సాక్షి, భీమవరం: గరగపర్రు రోడ్డులో ఇళ్ల తొలగించిన పేదలకు వెంటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో దాసి రాజును కలిసి పేదల ఇళ్ల తొలగించడం వల్ల ఏర్పడిన ఇబ్బందులను వివరించారు. ఎం .వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, పట్టి శంకరం, రావాడ మావుళ్ళమ్మ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కాళ్ల జగనన్న లేఅవుట్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కాళ్ల: ప్రతి పేదవాడికి ఇంటి స్థలం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ ఏఈ పి.ఆంజనేయరాజు తెలిపారు. మండల కేంద్రమైన కాళ్లలోని జగనన్న లేఔట్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఎలక్ట్రికల్ ఏఈ పి.రాంబాబు తో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వేంపాడు, కోపల్లె, బొండాడపేట, లేఔట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోలనపల్లి, కాళ్ల, ఏలూరుపాడు గ్రామాల్లో పనులు ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలు చేసుకుంటున్న లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా రానున్న పది రోజుల్లోపు పూర్తిస్థాయిలో లైన్లో ఏర్పాటుచేసి పవర్ సప్లై ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నళిని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో ముగిసిన హోమం



వేద పండితులను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురులో నిర్వహిస్తున్న శ్రీ లలితా పరాబట్టిక బట్టారికా దేవికి కోటి కుంకుమ పూజా సహిత శ్రీ చండీయాగ పూర్వక శ్రీ మహా మృత్యుంజయ పాశుపత శ్రీ రుద్రమహా యాగ మహోత్సవం బుధవారం పరిసమాప్తమైందని నిర్వాహకులు తెలిపారు. ముందుగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులను రాయకుదురు గ్రామ ప్రజలు ,నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. యాగకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, పోలిశెట్టి సత్యనారాయణ, పచ్చిగోళ్ల శ్రీనివాసగుప్త, పచ్చిగోళ్ల ఉమామహేశ్వరరావు, దూది నరసింహారావు, పోలిశెట్టి శివన్నారాయణ, కొడమంచిలి వెంకటేశ్వరరావు, గణమనిడి జవహర్లాల్ నెహ్రూ, పచ్చిగోళ్ల చంద్రశేఖర్, వీరుబొట్ల రామారావు, దాసరి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన

ఆకివీడు: వ్యాధులను అరికట్టేందుకు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులు, అనారోగ్య పరిస్థితుల్ని అరికట్టేందుంకు కృషి చేయాలని 104 హెల్త్ అసిస్టెంట్ ఫ్లోరెన్స్ పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వరహా గిరి, వెంకట గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 104 సేవల్ని బుధవారం ఆమె వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొండి వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల్ని మందులతో తగ్గించవచ్చునన్నారు గ్రామాల్లో నెలకు రెండు పర్యాయాలు 104 సేవలందిస్తున్నామని చెప్పారు. ఉచితంగా బీపీ, సుగర్ బిళ్లలు, పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. బీపీ, సుగర్‌లను కూడా నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.

రేపు ఉండి ఏఎంసీలో ఆసరా పంపిణీ

ఉండి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసరా పంపిణీ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉపకారవేతనాల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉపకార వేతనాల ప్రదానోత్సవం నిర్వహించారు. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు చేతులమీదుగా 71 మంది విద్యార్థులకు దాతలు, సమితి నిధుల నుంచి రూ.8 లక్షలు సేకరించి ఉపకార వేతనాలుగా ఇచ్చారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి సీహెచ్‌వీవీడీ సుబ్రహ్మణ్యం రాజు, ఉపాధ్యక్షురాలు చేకూరి ఝాన్సీ లక్ష్మి, కోశాధికారి నడింపల్లి వెంకట సత్య సుబ్బ రాజు, కూసంపూడి వెంకట సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

గాలికుంటువ్యాధిపై అప్రమత్తత అవసరం



కొమరాడలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపై పశుపెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని లేకుంటే పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వెటర్నరీ వైద్యుడు పి.పుండరీబాబు అన్నారు. మండలంలోని కొమరాడ గ్రామంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ పుండరీబాబు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం పొందేందుకు లక్షలు విలువ చేసే గేదెలు, ఆవులను పెంచుతున్నారన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడమేకాకుండా ప్రాణాపాయస్థితికి చేరుకుంటాయన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి కావడంతో ఒకదాని నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను తమ పశువులకు తప్పకుండా వేయించాలని కోరారు. అనంతరం 53 ఆవులకు, 180 గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాట్నాల రామకృష్ణస్వామి పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: పశుపెంపకందారులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని ఆకివీడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ అన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో చేపట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో సుమారు 160 పశువులకు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి డా.చంద్రబాబు, వల్లూరి సురేష్, చందు, ప్రసాద్ పాల్గొన్నారు.